సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 5 । అక్టోబర్ । 2024



అన్నదాన పథకానికి విరాళం


ఆత్రేయపురం: ర్యాలిలోని జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో అన్నదాన పథకానికి జయంతి సూర్యనారాయణమూర్తి (రాజమండ్రి) రూ.50,116 విరాళం అందించారు.



సంక్రాంతికి రెడీ

సంక్రాంతి పేరు చెబితే గుర్తుకు వచ్చేవి పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే కోడి పందాలే. మూడు రోజుల పాటు జరిగే కోడి పందేల ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారతాయి. - 6లో

1.62 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 1,62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 14 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

7 నుంచి తపాలా వారోత్సవాలు

అమలాపురం టౌన్: అమలాపురం పోస్టల్ డివిజన్‌లో సోమవారం నుంచి 11వ తేదీ వరకూ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం సూపరింటెండెంట్ ఆర్.నవీన్ కుమార్ తెలిపారు. 7న మెయిల్స్ అండ్ పార్సిల్స్ దినోత్సవం, 8న ఫిలాటెలీ దినోత్సవం, 9న ప్రపంచ తపాలా దినోత్సవం, 10న తపాలా పథకాలపై అంత్యోదయ దివస్ కార్యక్రమాలు, 11న పొదుపు, బీమా తదితర అంశాలపై పోస్టల్ వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధర్ మాట్లాడుతూ అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమాలకు ప్రజలు, పోస్టల్ వినియోగదారులు హాజరుకావాలని కోరారు.

లేబర్ చట్టాలకు తిలోదకాలు



అధ్యాపకుల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

మలికిపురం: మలికిపురం ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థ లేబర్ చట్టాలను అమలు చేయడం లేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరశన శుక్రవారం 24వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ సందర్శించి అధ్యాపకులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్రటరీ, కరస్పాండెంట్ అవలంబిస్తున్న నిరంకుశ వైఖరి మానవ హక్కులను హరించేలా లేబర్ చట్టాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. కాంతారావు కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా ఇక్కడి పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని త్వరలో జరిగే శాసన మండలి సమావేశాలలో శాసన మండలి చైర్మన్ సహకారంతో లేవనెత్తుతానన్నారు. లక్కవరం మంగిన గురయ్య కాలేజీ అధ్యాపక సిబ్బంది వరుసగా రెండో రోజున కూడా శిబిరాన్ని సందర్శించి తోటి అధ్యాపకులకు మద్దతు తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన కళాశాల పూర్వ విద్యార్థిని, కేసుదాసుపాలెం హెచ్‌ఎం పాటి సుజాత మృతికి సంతాపం తెలిపారు.

మత రాజకీయాలు తగవు

కపిలేశ్వరపురం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మత రాజకీయాలను వీడి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలు విషయాన్ని వదిలి, సనాతన ధర్మం పేరుతో మతాన్ని భుజాన వేసుకుని తిరగడం హాస్యాస్పదమన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు రోడ్డుపైకి వచ్చి పోరాడుతుంటే.. పవన్ ప్రాయశ్చిత్త దీక్ష పేరుతో సామాన్యులకు దూరంగా మసలుతున్నారన్నారు. ఆయన ఇప్పటికైనా ప్రజాస్వామ్యయుతంగా ఆలోచన చేసి పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

గాయత్రీదేవిగా అమ్మవారు



ద్రాక్షారామలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు బదిలీ

కొత్తపేట: జిల్లాలో పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న గ్రేడ్ -1 నుంచి గ్రేడ్ - 5 కార్యదర్శులకు స్థాన చలనం కల్పించింది. ఈ మేరకు జిల్లాలో 88 మంది కార్యదర్శులు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయా మండలాల్లో పని చేస్తున్న కార్యదర్శులను రిలీవ్ చేయాలని, పోస్టింగ్ ఇచ్చిన మండలాల్లో జాయిన్ చేసుకోవాలని సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఆదేశాలు వెళ్లాయి.

బాబుకు భంగపాటు



- లడ్డూ రాజకీయాలకు సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ
- సీబీఐ అధ్వర్యంలో సిట్ ఏర్పాటు
- స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశం
- ముఖ్యమంత్రికి చెంపపెట్టు
- స్వాగతిస్తున్న జిల్లా వాసులు

సాక్షి, అమలాపురం: చంద్రబాబు మార్కు తిరుమల లడ్డూ రాజకీయం బెడిసికొట్టింది. ఒక అబద్ధాన్ని పదే పదే ప్రచారం చేయడం ద్వారా నిజం చేయాలనుకునే బాబు తరహా వ్యూహాలకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు బ్రేకు వేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను కాదని సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో చంద్రబాబు సర్కార్‌కు జెల్ల తగిలినట్టయ్యింది. సీబీఐ ఆధ్వర్యంలో విచారణ ద్వారా నిజాలు బయటకు వస్తాయని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, హిందూ విశ్వాస భక్తులు అభిప్రాయపడుతున్నారు.

లడ్డూ నాణ్యతపై ఆరోపణలు

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఆరోపించారు. ఆ పాపం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనంటూ బురద జల్లారు. చంద్రబాబు ఆరోపణలకు కొనసాగింపుగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా నానాయాగి చేస్తున్నారు. లడ్డూ విషయంలో నిరాధారణమైన ఆరోపణలు చేయడమే కాకుండా వాటిని నిజమని నమ్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. దీనిపై వైఎస్సార్ సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఎదురుదెబ్బ

లడ్డూపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన దుష్ప్రచారంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో చంద్రబాబు నాయుడికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌పై నమ్మకం లేని సుప్రీంకోర్టు సీబీఐ ఆధ్వర్యంలో మరో సిట్‌ను ఏర్పాటు చేసిందని, ఇది ముమ్మాటికి ప్రభుత్వానికి ఎదురుదెబ్బేనని పలువురు వక్తలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హిందూ భక్తులు అభిప్రాయపడుతున్నారు. వంద రోజుల పాలనలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం, సూపర్ సిక్స్ హామీలు, విజయవాడ వరదల విషయంలో ప్రజల నుంచి వస్తున్న విమర్శలను పక్కదారి పట్టించేందుకే చంద్రబాబు లడ్డూ రాజకీయం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

చంద్రబాబు ఘోరమైన తప్పు చేశారు



తిరుపతి లడ్డూ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా ఘోరమైన తప్పు చేశారు. కేవలం ఇది రాష్ట్ర ప్రజలకు సంబంధించింది కాదు. ప్రపంచంలోనే ఇతర దేశాలకు చెందిన ఇతర మతాల వారు సైతం పవిత్రమైన క్షేత్రంగా భావించి తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. లడ్డూ విషయంలో చంద్రబాబు వ్యవహార శైలి చాలా మూర్ఖంగా ఉంది. ఇది క్షమించరాని నేరం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాష్ట్ర ప్రజలకు అత్యంత అభిమానం ఉందని, దాన్ని చెరిపివేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కుట్రపూరిత ఆరోపణలు చేయడం క్షమించరాని విషయం. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోవడంతో చంద్రబాబుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజల దృష్టిని మరల్చడానికి తిరుపతి లడ్డూ వివాదాన్ని చంద్రబాబు తీసుకొచ్చారు.

– పిల్లి సుభాష్ చంద్రబోస్, రాజ్యసభ ఎంపీ, రామచంద్రపురం

సీబీఐ విచారణ ఒక్కటే మార్గం



తిరుపతి లడ్డూ విషయంలో సీబీఐ విచారణతోనే నిజాలు బయటకు వస్తాయి. సీఎం చంద్రబాబు చేసిన ఈ పాపానికి ప్రక్షాళన జరగాలంటే సీబీఐ విచారణ ఒక్కటే మార్గం. ముఖ్యమంత్రిగా బాధ్యతాయుత పదవిలో ఉండి కూడా తప్పుడు ఆరోపణలు చేయడం ద్వారా చంద్రబాబు హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. లడ్డూ దర్యాప్తు విషయంలో సుప్రీంకోర్టు తీసుకున్న చొరవ స్వాగతించేలా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలి.

– పినిపే విశ్వరూప్, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

బాబుకు ఎదురుదెబ్బ



తిరుపతి లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాలతో చంద్రబాబుకు ఎదురుదెబ్బ తగిలినట్టే. ఆయన పవిత్రమైన తిరుపతి లడ్డూపై అర్థంపర్థంలేని ఆరోపణలు చేశారు. దాని దర్యాప్తులో సీబీఐతో పాటు కొన్ని శాఖల అధికారులను కూడా భాగస్వాములు చేయడం మంచి పరిణామం. ఇప్పటికైనా చంద్రబాబు వాస్తవాలను గ్రహించి కోర్టు సూచించిన విచారణకు సహకరించాలి.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ, అమలాపురం

స్వాగతిస్తున్నాం



వేంకటేశ్వరస్వామి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో సుప్రీంకోర్టు చొరవను స్వాగతిస్తున్నాం. సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో స్వతంత్ర దర్యాప్తుకు ఐదుగురు సభ్యులతో సిట్ ఏర్పాటు చేయడం హర్షణీయం. దీనివల్ల ఏ విధమైన రాజకీయ ప్రలోభాలు లేకుండా దర్యాప్తు జరుగుతుందనే విశ్వాసం పెరిగింది. లడ్డూ వ్యవహారం రాజకీయం చేయటం తగదని చంద్రబాబుకు సుప్రీం కోర్టు మొట్టికాయలు వేయడం ఇది రెండవసారి. కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడటం సరికాదు.

– బొమ్మిడి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ, అల్లవరం.

చంద్రబాబు తీరు దారుణం



హిందువుల మనోభావాలను చంద్రబాబు కించపరిచారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందనే వివాదం సృష్టించడం చాలా దారుణం. హిందువుల మనోభావాలతో చంద్రబాబు ఆడుకుంటున్నారు. సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తును ఏర్పాటు చేయడం అంటే ప్రభుత్వాన్ని అభిశంసించడమే. సీబీఐ పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయడం వల్ల నిష్పక్షపాతంగా విచారణ జరుగుతుందనే నమ్మకం ఏర్పడింది.

– రుద్రరాజు రమేష్ రాజు, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్

పారదర్శకంగా జరగాలి



తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తును స్వాగతిస్తున్నాం. లడ్డూ వివాదంపై దర్యాప్తు పారదర్శకంగా జరగాలి. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. హిందూ దేవాలయాల్లో ఇటు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చట్టాలను తీసుకురావాలి.

– నాగాభట్ల రవిశర్మ, ఆలయ స్వస్తి వాచకులు, వీరేశ్వరస్వామి దేవస్థానం, మురమళ్ల


అవయవదానం .. మరికొందరికి జీవం

స్ఫూర్తి ప్రదాతలుగా చక్రవర్తి కుటుంబం



అవయవాలను సేకరించిన అపోలో ఆసుపత్రి వైద్య బృందం

మండపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురికావడంతో కుటుంబ సభ్యులు అవయవదానానికి సంకల్పించి స్ఫూర్తి ప్రదాతలయ్యారు. వివరాల్లోకి వెళితే.. మండపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రెడ్డి కళ్యాణ్ చక్రవర్తి తన స్నేహితులకు ఏటా సీజనల్‌గా వచ్చే పండ్లను పంపించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈ నెల రెండున రాజానగరం మండలం చక్రద్వార బంధం, తుంగపాడు తోటల్లోకి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో పండ్లు తీసుకొని ఇంటికి తిరిగొస్తుండగా తుంగపాడు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. స్థానికుల సాయంతో ఆయనను కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యం అందిస్తుండగా శుక్రవారం చక్రవర్తి బ్రెయిన్ డెడ్ అయ్యారని వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు చక్రవర్తి అవయవాలను దానం చేయాలని సంకల్పించారు. దీంతో కాకినాడ అపోలో ఆసుపత్రి వైద్యులు గుండె, కళ్లు, కిడ్నీలు సేకరించారు. పోలీసు అధికారుల సహకారంతో గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక వాహనంలో విశాఖపట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అవయవాలను తరలించారు. మరికొందరికి జీవం పోసిన రెడ్డి కళ్యాణ్ చక్రవర్తి కుటుంబ సభ్యులను పలువురు అభినందిస్తున్నారు. చక్రవర్తి పార్థివ దేహాన్ని మండపేట తీసుకువచ్చి కుటుంబ సభ్యులు, సన్నిహితుల సందర్శన అనంతరం ఏడిదలో దహన సంస్కారాలు నిర్వహించారు.



చక్రవర్తి (ఫైల్)

స్నానాల రేవును తవ్వేశారు



కోటిపల్లి పుష్కర ఘాట్‌లో తవ్వుతున్న పొక్లెయిన్

కె.గంగవరం: కూటమి నేతల వర్గ విభేదాలు భక్తులకు శాపంగా మారాయి. కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలోని గౌతమి గోదావరి ఒడ్డున ఉన్న పుష్కర ఘాట్‌లో ప్రతి రోజు వందల మంది పుణ్య స్నానాలు చేస్తారు. గోదావరి పుష్కరాలకు, మహాశివ రాత్రి రోజున వేలాది మంది భక్తులు ఇక్కడకు వచ్చి స్నానాలు చేసి సోమేశ్వర స్వామిని దర్శించుకుంటారు. రాజమహేంద్రవరం తరువాత పేరుగాంచిన పుష్కర ఘాట్ కోటిపల్లిలో ఉండడం వల్ల భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. అంత ప్రాధాన్యం ఉన్న కోటిపల్లి రేవును కూటమి నేతలు ధ్వంసం చేశారు. ఇద్దరు నేతల మధ్య జరుగుతున్న పోరు దీనికి కారణమైంది. ఈ పుష్కర ఘాట్ వద్ద స్థలంలో తన తల్లి పేరిట స్త్రీలు వస్త్రాలు మార్చుకునే షెడ్డు నిర్మించేందుకు కూటమి నేత ముందుకు వచ్చారు. అయన వ్యతిరేక వర్గానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు అదే స్థలంలో ఆంజనేయస్వామి విగ్రహం నెలకొల్పడానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆశీస్సులు కోరారు. దీంతో భక్తులకు ఇబ్బంది వస్తుందనే ఉద్దేశంలో షెడ్డు నిర్మించాల్సిన కూటమి నేత వెనక్కి తగ్గారు. అంతకు ముందే ఇద్దరి మధ్య వర్గ పోరు ఉండడంతో ప్రజాప్రతినిధి ఆశీస్సులున్న వర్గం స్నానాల రేవును బద్దలు కొట్టి అక్కడ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని నేలకొల్పేందుకు రెండు రోజుల నుంచి సన్నాహాలు చేసింది. పొక్లెయిన్ సాయంతో ఎంతో పటిష్టంగా ఉన్న రేవును తవ్వేసింది. కోటిపల్లి రేవు వద్ద చాలా స్థలం ఖాళీ ఉన్నా.. స్నానాల రేవు ధ్వంసం చేయడంపై విమర్శలు వచ్చాయి.

మాన్సాస్ ట్రస్ ప్రతినిధులు అడ్డుకోవడంతో..

కోటిపల్లి రేవులోని భూములు, షాపులు, స్నాన ఘట్టాలు మొత్తం విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కు చెందినవి. రేవు ధ్వంసంపై సమాచారం తెలియడంతో ట్రస్ట్‌కు చెందిన నౌకర్లు తవ్వకాన్ని అడ్డుకునున్నారు. భక్తుల నుంచి వ్యతిరేకత రావడం, ట్రస్టు నుంచి కూడా అనుమతులు లేకపోవడంతో తవ్వకం చేపట్టిన కూటమి వర్గం ప్లేటు పిరాయించింది. వెంటనే తవ్విన ప్రదేశాన్ని చదును చేసి పక్కనే మరో స్థలాన్ని ఎంపిక చేసుకుని నిర్మాణాన్ని చేపట్టింది.

క్లుప్తంగా

యోగా పోటీల్లో కానిస్టేబుల్ సత్తా



కానిస్టేబుల్ రోహిణిని అభినందిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు శాఖలోని సైబర్ ల్యాబ్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆర్.రోహిణి యోగా పోటీలో సత్తా చాటారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాయ్‌లో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా పోలీసు క్లస్టర్ చాంపియన్ షిప్‌లో పాల్గొని రెండోసారి కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమెను ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించారు. జాతీయ స్థాయిలో మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బారాజు పాల్గొన్నారు.

రూ.1.60 లక్షల జరిమానా

తుని రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు తుని ప్రిన్సిపల్ సివిల్ కోర్టు జడ్జి రూ.1.60 లక్షల జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 16 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున రూ.1.60 లక్షల జరిమానా విధించారన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

రావులపాలెం: మండలంలోని దేవరపల్లి శివారు రాజుగారిదొడ్డి వద్ద శుక్రవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేసి, ఐదుగురిని గాయపరిచింది. వారిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన యార్లగడ్డ గన్నెమ్మ, పానుకుపట్ల శాంతమ్మ, చిట్టూరి జ్యోతిలను కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం స్థానికులు తరలించారు. ఇద్దరు పురుషులకు స్వల్ప గాయాలయ్యాయి.

నేటి నుంచి ఆర్టీసీ బస్ పాస్ వెబ్‌సైట్ బంద్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా ప్రయాణికులు, విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాసులు జారీ చేసే వెబ్‌సైట్ శని, ఆదివారాల్లో (ఈ నెల 4, 5 తేదీలు) పనిచేయదు. ఈ విషయాన్ని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం శుక్రవారం తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఆధునీకరణలో భాగంగా ఈ సేవలు నిలిచిపోనున్నాయన్నారు. అనంతరం ఈ నెల 7వ తేదీ నుంచి యథాతథంగా బస్‌పాసులను కౌంటర్లలో మంజూరు చేస్తారన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

సంక్రాంతికి రెడీ



నీటి తొట్టెలో ఈత కొడుతున్న పుంజు



పెంపకం కేంద్రంలో పందెం పుంజులు

- పందేలకు సిద్ధమవుతున్న పుంజులు
- ఇప్పటికే మొదలైన శిక్షణ
- మటన్, గుడ్డు, బాదం, ఎండు ఖర్జూరం, వెల్లుల్లితో ప్రత్యేక మేత

సాక్షి, భీమవరం: సంక్రాంతి పేరు చెబితే గుర్తుకు వచ్చేవి పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే కోడి పందాలే. మూడు రోజుల పాటు జరిగే కోడి పందేల ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారతాయి. బరిలో ప్రత్యర్థి పుంజును మట్టికరిపించేందుకు సంక్రాంతికి మూడు నెలల ముందు నుంచే పుంజులకు శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేకంగా బరులు

భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేకంగా బరులు, గ్యాలరీలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేసి నిర్వహించే కోడి పందేలు ఖ్యాతిగాంచాయి. వీటిని చూసేందుకు ఎందరో సినీ, రాజకీయ ప్రముఖులు వస్తుంటారు. పందేలకు ఉన్న క్రేజ్‌కు తగ్గట్టుగానే పుంజుల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కొందరు తమ ఇళ్లు, చెరువులు, పొలాలు వద్ద పుంజులను పెంచితే, ఎక్కువ మంది నాటుకోళ్ల కేంద్రాల్లో పుంజులను ఎంచుకుని వాటిని పందేలకు సిద్ధం చేసే పనిని పెంపకందారులకే అప్పగిస్తారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాలతో పాటు విదేశాల నుంచి సంక్రాంతికి జిల్లాకు వచ్చే ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో పుంజులను ఎంపిక చేసుకుని పెంపకందారులకు ముందే అడ్వాన్సులు చెల్లిస్తుంటారు. పందెం పుంజులకు ఉన్న డిమాండ్‌తో జిల్లాలోని భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, పాలకొల్లు, కాళ్ల తదితర మండలాల్లో 200కు పైగా నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు ఉన్నాయి. కొందరు స్థలాలను లీజుకు తీసుకుని వీటి పెంపకం సాగిస్తుంటారు. సామర్థ్యాన్ని బట్టి ఒక్కోచోట 100 నుంచి 250 వరకు వివిధ రకాల జాతుల పుంజులు, కోళ్లను పెంచుతుంటారు.

5 వేలకు పైగా కోళ్లు

కోడికి అందించే ప్రత్యేక మేత, మందులతో ఒక్కో పందెం పుంజును సిద్ధం చేసేందుకు మూడు నెలల్లో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ఈ విధంగా పెంచిన పుంజులను వాటి రంగు, ఎత్తు, పోరాట పటిమను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో అమ్ముతుంటారు. వీటిపై భారీస్థాయిలో పందేలు జరుగుతుంటాయి. పండగ కోసం ఐదు వేలకు పైగా పందెం కోళ్ల అమ్మకాలు జరుగుతుంటాయి. వీటి ద్వారా రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది.



ఆకివీడులోని నాటుకోళ్ల కేంద్రంలో పందెం పుంజులు

మూడు నెలల ముందు నుంచే..

కాకి, నెమలి, అబ్రాస్, డేగ, పచ్చ కాకి, సేతువ తదితర జాతులకు చెందిన ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వయసున్న పుంజులను పందేనికి వినియోగిస్తుంటారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వీటి పాత ఈకలు ఊడిపోయి కొత్త ఈకలు వస్తుంటాయి. తర్వాతి నుంచి వీటికి శరీర పటుత్వం, శక్తిని పెంచేందుకు శిక్షణ ప్రారంభిస్తారు. అందుకోసం ఎవరికి వారు ఎన్నో సంప్రదాయ, ఆధునిక పద్ధతులు పాటిస్తారు. పుంజులకిచ్చే ఆహారం, మందులు నుంచి శిక్షణ వరకు ప్రతి విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. తాము ఎలా పెంచుతుందీ ఇతరులకు తెలీకుండా గోప్యత పాటిస్తారు.

దినచర్య ఇలా..

మకాంలోని ఐరెన్ కేజ్‌లలో ఉండే పందెం కోళ్లను బయటకు తీసి ఆరు బయట కట్టడం మొదలుపెడతారు. అప్పటి నుంచే వీటి శిక్షణ మొదలవుతుంది. ప్రస్తుతం చాలా మకాంల వద్ద పుంజులను బయట కట్టడం ప్రారంభించారు. రోజు ఉదయాన్నే వేడి నీటిని పట్టిస్తారు. బరిలో చురుగ్గా కదిలేందుకు వీలుగా కాళ్లల్లో చురుకుదనానికి నెలరోజులు పాటు రోజు విడిచి రోజు సమీపంలోని చెరువులు, నీళ్ల తొట్టిల్లో ఈత కొట్టిస్తారు. తర్వాత వి ఆకారంలో నెట్‌లు కట్టి పుంజు అందులోనే తిరిగే విధంగా బేటా (నిర్ణీత పద్ధతిలో వాకింగ్) కొట్టిస్తారు. మరి కొందరు ఖాళీ జాగాలో వాటి వెనుకే ఉండి తరుముతూ వాకింగ్ చేయిస్తారు. మేత పెట్టి 11 గంటల సమయం వరకు ఎండలో కట్టేసిన తర్వాత మకాంలోకి మార్చేస్తారు.

రాజభోగం

కోపం వచ్చినప్పుడు నిన్ను పందెం పుంజును మేపినట్టు మేపానని చెప్పడం గోదావరి జిల్లాల్లో నానుడి. దీనినిబట్టి పందెం కోళ్లను ఇక్కడ ఏ విధమైన మేతను అందిస్తారో అర్థం చేసుకోవచ్చు. శిక్షణలో శక్తి, సామర్థ్యం పెంచేందుకు, శరీరంలో కొవ్వు చేరకుండా తేలిగ్గా ఎగురుతూ ప్రత్యర్థిపై విరుచుకుపడేందుకు పందెం పుంజులకు ఈ మూడు నెలలు ప్రత్యేక మేతను అందిస్తారు. కోడి సైజును బట్టి ఉదయం పూట 20 నుంచి 40 గ్రాముల వరకూ ఉడకబెట్టిన మటన్, మూడు నుంచి ఐదు వరకు బాదం గింజలు, రెండు వెల్లుల్లి, ఒక ఎండు ఖర్జూరం, కోడిగుడ్డు ముక్కలు చేసి పెడతారు. తిరిగి సాయంత్రం ఎప్పటి మాదిరి సోల్లు, గంటులు, మెరికలు మొదలైన పెడతారు. పండగకు మూడు నెలలు మాత్రమే సమయం ఉండటంతో ఇప్పటికే భీమవరం పరిసర ప్రాంతాల్లో పందెంకోళ్ల పెంపకం జోరుగా సాగుతోంది.

వీరేశ్వరస్వామి ఆలయానికి ఐఎస్ఓ గుర్తింపు



ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న ఆలయ ఏసీ లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయానికి ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) గుర్తింపు లభించింది. దీనితో పాటు ఐఎస్ఎల్ సంస్థ కూడా ఆలయాన్ని గుర్తించింది. ఈ మేరకు శుక్రవారం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, పర్యవేక్షణ అధికారి కఠారి శ్రీనివాసరాజులకు ఐఎస్ఓ సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఏదైనా ఒక సంస్థ నాణ్యత, భద్రత, సామర్థ్యం, పనితీరును నిర్ధారించడానికి ఐఎస్ఓ ధ్రువీకరణ దోహదపడుతుంది. మురమళ్ల వీరేశ్వరస్వామి వారికి విశేష చరిత్ర ఉంది. పచ్చని పొలాల మధ్య ఈ ఆధ్యాత్మిక కేంద్రం భాసిల్లుతోంది. నిత్య కల్యాణ శోభితుడైన భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఇక్కడ కొలువుదీరారు. యువత ఇక్కడ స్వామివారి కల్యాణం జరిపించుకొంటే వారికి వివాహం జరుగుతుందని భక్తుల నమ్మకం. గత పదేళ్లుగా ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇక్కడ వసతులు సైతం అదే స్థాయిలో వృద్ధి చెందుతున్నాయి. భక్తులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని వీరేశ్వర అన్నదాన ట్రస్టు ద్వారా అందిస్తున్నారు. ఆలయంతో పాటు అన్నదాన నాణ్యత నిర్ధారిస్తూ ఐసీఎల్, ఐఎస్ఓ ధ్రువీకరణ ప్రతాలు వచ్చాయి.

కనకదుర్గమ్మకు స్వర్ణకిరీటం సమర్పణ



అమ్మవారికి అలంకరించిన స్వర్ణకిరీటం

గోకవరం: గ్రామంలోని దేవీచౌక్‌లో కొలువైన కనకదుర్గమ్మకు శుక్రవారం రూ.21 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అలంకరించారు. విశ్వ హిందూధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భక్తులు కలిసి దీన్ని తయారు చేయించారు. ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో స్వర్ణ కిరీటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అలకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా.. కనకదుర్గమ్మ శుక్రవారం గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

నగదు చెల్లించకుంటే క్రిమినల్ కేసులు

సీతానగరం: వెదుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో గల్లంతైన నగదును వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో బాధ్యులను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు పెడతామని డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆడిటర్ ఆఫీసర్, ఇన్‌చార్జి డీఆర్ జనార్దనరెడ్డి తెలిపారు. ఆ పీఏసీఎస్‌లో లక్షల రూపాయల నగదు గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీసీవో శ్రీరాములు నాయుడు, డీసీఏవో, ఇన్‌చార్జి డీఆర్ జనార్దన రెడ్డి, డీజీఎం మద్దిపాటి శ్రీధర్, ఏజీఎం ఏసుబాబు, డీసీసీబీ జనరల్ మేనేజర్ ప్రవీణ్, ఆడిటర్లు సుధాకర్, చంద్రశేఖర్, పార్ట్‌టైమ్ పర్సన్ ఇన్‌చార్జి కృష్ణ మోహన్ శుక్రవారం వెదుళ్లపల్లి పీఏసీఎస్‌ను సందర్శించారు. గల్లంతైన నగదు చెల్లింపు జరిగాయా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రానికి నగదు చెల్లించాలని, లేకుంటే పీఏసీఎస్ సీఈవో సురేంద్ర, గుమస్తా పోశియ్య, ఎరువుల సేల్స్‌మేన్‌లను సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు పెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భగా 'సాక్షి'తో మాట్లాడుతూ వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో రూ.64 లక్షలు గల్లంతయ్యాయని, వాటిలో రూ.32 లక్షలు చెల్లించడం జరిగిందన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- కాలువలోకి దిగి ఇద్దరు పిల్లల మృతి
- తూరంగి ఉప్పరపేటలో విషాదం



గండికోట దుర్గాప్రసాద్ (ఫైల్)



తన చెల్లితో అభిరామ్ (ఫైల్)

కాకినాడ రూరల్: దసరా సెలవుల నేపథ్యంలో ఇంటి వద్ద ఉన్న ఆ పిల్లలు ఈత కొట్టేందుకు కాలువలో దిగారు. హుషారుగా నీటిలో దిగిన వారిని మృత్యువు కాటేసింది. కాకినాడ రూరల్ తూరంగి ఉప్పరపేటలో శుక్రవారం ఈ విషాదం జరిగింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూరంగి అయ్యప్ప స్వామి గుడి ఎదురుగా ఉన్న పంట కాలువలో ఈత కోసం నలుగురు విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం వెళ్లారు. వారిలో వెంకన్న, కిరణ్ ఒడ్డున ఉండగా రెండో తరగతి విద్యార్థి జక్కి అభిరామ్(8), మూడో తరగతి విద్యార్థి గండికోట దుర్గా ప్రసాద్ (10) నీటిలోకి దిగారు. చిన్న పిల్లలు కావడం, ఎత్తు తక్కువగా ఉండడంతో నీటిలో మునిగిపోయారు. ఒడ్డున ఉన్న పిల్లలు పరుగున ఇళ్లకు వెళ్లి ఈ విషయాన్ని తెలియజేశారు. స్థానికులు కాలువ దగ్గరకు చేరుకుని మునిగిపోయిన పిల్లలను బయటకు తీశారు. వెంటనే కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ పిల్లలిద్దరూ చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌లో మార్చురీకి తరలించారు. అభిరామ్ తండ్రి వెంకట దుర్గ ఫిర్యాదు మేరకు ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఉప్పరపేటకు చెందిన జక్కి వెంకట దుర్గకు అభిరామ్‌తో పాటు కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేసుకునే జీవించే వెంకటదుర్గ దంపతులు కుమారుడి మృతితో విషాదంలో మునిగిపోయారు. మరో మృతుడు దుర్గా ప్రసాద్ తండ్రి నూకరాజు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి



దీప్తి (ఫైల్)

మధురపూడి: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందింది. కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఎస్సై టి.శ్యామ్ సుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన జుజ్జువరపు వెంకటదీప్తి (20) సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తన స్నేహితులతో కలిసి కాలేజీ నుంచి కోరుకొండలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి బయలుదేరింది. స్నేహితురాలు అనూషతో కలిసి స్కూటీపై వస్తుండగా బూరుగుపూడి జంక్షన్ వద్ద వారిని ఎదురుగా వేగంగా వచ్చిన టాటాఏసీ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో దీప్తి అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీపై వెనుక కూర్చున్న అనూషకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే కోరుకొండ సీఐ సత్య కిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ తలకు బలమైన గాయం కావడం వల్ల దీప్తి మృతి చెందిందన్నారు. తలకు హెల్మెట్ ధరించి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదన్నారు. మృతురాలి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై శ్యామ్ సుందర్ కేసు నమోదు చేశారు.

మల్లిసాలలో మోటారు సైకిలిస్టు..

జగ్గంపేట: ట్రక్కు ఆటో ఢీకొని మోటారు సైకిలిస్టు మృతి చెందిన ఘటన మల్లిసాల గ్రామంలో జరిగింది. ఎస్సై టి.రఘునాథబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లిసాల గ్రామానికి చెందిన మాత సత్తిబాబు (40) గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో మోటారు సైకిల్‌పై గ్రామంలోని దుకాణం వద్దకు పెరుగు ప్యాకెట్ కోసం వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా గోకవరం వైపు వెళుతున్న ఆటో అతడికి ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్తిబాబు తలకు బలమైన గాయమైంది. అతడిని చికిత్స కోసం జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సత్తిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

మామిడికుదురు: గుర్తుతెలియని వాహనం ఢీకొని మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. జాతీయ రహదారిపై మామిడికుదురు వద్ద శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. మలికిపురం మండలం గొల్లపాలేనికి చెందిన కె.శ్రీనివాసరావు (38) రాజోలు మండలం కాట్రేనిపాడు పాటిభూమిలో నివాసం ఉంటున్నాడు. సొంతంగా క్రేన్ కొనుక్కుని దాన్ని తానే సొంతంగా నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో క్రేన్ విడిభాగాల కోసం కొత్తపేట వెళ్లి తిరిగి వస్తున్నాడు. అతడిని మామిడికుదురులో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. నగరం ఎస్సై ఎ.చైతన్య కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావుకు భార్య రాణికుమారి, ఐదేళ్ల కుమార్తె కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.

అప్పుల బాధ తాళలేక..

రాజమహేంద్రవరం రూరల్: అప్పుల బాధ తాళలేక ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం హుకుంపేట డి బ్లాకుకు చెందిన కొవ్వాకుల సాయి(38) చేపల వేటకు వెళుతుంటాడు. సంక్రాంతి పండగ సమయంలో హరిదాసుగా ఊరూరా తిరుగుతాడు. అతడికి భార్య వరలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే అప్పులు బాగా చేయడంతో ఒత్తిడి తట్టుకోలేక మద్యానికి బానిసయ్యాడు. దీంతో పిల్లలను తీసుకుని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో గురువారం భార్య వద్దకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేశాడు. శుక్రవారం ఉదయం చూసేసరికి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తితో పూజిస్తే అమ్మవారి ఆశీస్సులు



అమ్మవారికి హారతి ఇస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తే అమ్మవారి ఆశీస్సులు లభిస్తాయని పరిపూర్ణానంద స్వామి అన్నారు. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని రమణయ్యపేటలోని శ్రీపీఠంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగంలో భాగంగా రెండో రోజు శుక్రవారం కుంకుమార్చనలకు ముందు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. రెండు రోజులకు 16 కోట్ల కుంకుమార్చన మంత్రోచ్ఛరణలు జరిగాయని ప్రకటించారు. పది రోజుల్లో వంద కోట్ల కుంకుమార్చనలు పూర్తి చేస్తామన్నారు. 9న త్రికోటి మహా సరస్వతి పూజను 24 వేల మంది విద్యార్థులతో ఉచితంగా చేయిస్తామని వెల్లడించారు. విద్యార్థులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. రెండో రోజు కుంకుమార్చనలలో సుమారు 30వేల మంది భక్తులు హాజరయ్యారు. ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు శ్రీదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. రాత్రి పసుపు కొమ్ములతో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఏపీ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ ప్రారంభం



పరుగుపందెంలో తలపడుతున్న క్రీడాకారులు


ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, శాప్ మాజీ సభ్యుడు యర్రా వేణుగోపాలరాయుడు ప్రారంభించారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు సుమారు 17 జిల్లాల నుంచి 1300 మంది క్రీడాకారులు , కోచ్‌లు హాజరయ్యారు. రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయి. వీటిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 16, 17, 18 తేదీల్లో గుంటూరులో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు అర్హత సాధిస్తారు.

నలుగురికి జైలు

శంఖవరం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగల చోరీ కేసులో నలుగురికి నాలుగు నెలల జైలుశిక్ష విధిస్తూ ప్రత్తిపాడు కోర్టు జడ్జి బుల్లమ్మ శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ విషయాన్ని అన్నవరం ఎస్సై హరిబాబు విలేకరులకు తెలిపారు. శంఖవరం ఎలక్ట్రికల్ ఏఈ భగవతి కుమార్ రెండు కేసుల్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుంకర సతీష్, కొమ్మిరెడ్డి దుర్గ, నక్కా నాగేంద్ర, నెల్లూరి లోవరాజులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

పట్టం కట్టేదెవ్వరికో..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి
- ఇప్పటికే కొందరు స్వతంత్రుల ప్రచారం
- ఖరారు కాని అభ్యర్థులు
- వచ్చే నెల 8 వరకూ ఓటు నమోదుకు అవకాశం



కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. ఆయా జిల్లాల పరిధిలోని పట్టభద్రుల ఓటర్లపై ఆశావహులు గురిపెట్టారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పదవీ కాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఖాళీ స్థానానికి ఎన్నికలు నిర్వహించాలి. ఇందులో భాగంగా గత నెల 30 నుంచే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ మొదలైంది. డిగ్రీ పూర్తి చేసిన వారందరూ ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలంటూ బరిలో ఉండే అభ్యర్థులు మెసేజ్‌లు, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో విస్తృతం ప్రచారం చేస్తున్నారు.

ప్రచారం ప్రారంభం

ఇప్పటికే ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పోటీకి ఆసక్తి చూపిస్తున్న పలువురు ఆయా జిల్లాల్లో పర్యటిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా కొత్త ఓటర్లు, యువత, విద్యావంతులను కలుస్తున్నారు. నవంబర్ 8 వరకూ ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉండడంతో ఆ మేరకు అర్హులైన వారికి ఓటుహక్కు కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

పోటీలో నిలిచేదెవరో..

ఉమ్మడి జిల్లా నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బరిలో ఉండే అభ్యర్థుల పేర్లు ఇంకా బయటకు వెల్లడి కావడం లేదు. కానీ ఈసారి ఈ జిల్లా నుంచి బలమైన నాయకులు పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే రాజకీయ పార్టీ మద్ద తు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయనున్న పలువురు పొరుగు జిల్లా నుంచి వచ్చి ఉమ్మడి జిల్లాలలో పర్యటిస్తున్నారు. ఇక్కడ విద్యా సంస్థలు నిర్వహిస్తున్న ప్రముఖులు కూడా కార్యాచరణ ప్రారంభించారు. టీడీపీ నుంచి సానా సతీష్‌బాబు, బీజేపీ నుంచి పోతుల వెంకట విశ్వం, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి జనసేన నుంచి పోటీలో ఉండేందుకు ప్రయత్నిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. మరో వైపు టీడీపీ, జనసేన, బీజేపీలతో పాటు ఇతర రాజకీయ పార్టీల మద్దతు పొందే నాయకులతో పాటు ఆదిత్య శేషారెడ్డి, చైతన్యరాజు, ప్రగతి కృష్ణారావు, హర్షకుమార్, యూటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల నుంచి మరి కొందరు స్వతంత్రంగా బరిలో దిగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వచ్చే ఫిబ్రవరి లోపు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. డిసెంబర్ చివరిలో తుది జాబితా సిద్ధం కానుంది.

పోటీ ఎక్కువే..

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 34 అసెంబ్లీ స్థానాలు, ఐదు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఆయా జిల్లాల్లో పట్టభద్రుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుంది. అలాగే ఎన్నికల బరిలో చాలామంది అభ్యర్థులు నిలబడతారు. ఆయా రాజకీయ పార్టీల మద్దతు ఎవరికి ఉంటే ఆ అభ్యర్థి చివరిగా బరిలో ఉంటారు. ఇక స్వతంత్రులుగా పోటీ చేసే వారి సంఖ్య కూడా అధికంగా ఉంటుంది. రాజకీయ నాయకులు, విద్యావంతులు, వివిధ వృత్తుల్లో ఉన్న సామాజిక కార్యకర్తలు పోటీలో ఉండేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు. అయితే అయితే కాకినాడ, అమలాపురం, ఉండి, భీమవరం, నరసాపురం ప్రాంతాల నుంచి ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్న అభ్యర్థులే పోటీలో నిలబడుతున్నారు.